## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్ , జనవరి 5 : 11 కేవీ వెస్టర్న్ హిల్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో వెస్టర్న్ హిల్స్ , అడ్డగుట్ట ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు , 11 కేవీ పోలీస్ స్టేషన్ పరిధిలో అడ్డగుట్ట రోడ్ నం.1, 2, 3, 4 ,5 6, 7 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, పీజేఆర్ నగర్ ఫీడర్ పరిధిలో ఎన్‌టీఆర్ నగర్, పీజేఆర్ నగర్, జన్మభూమి కాలనీ, కమలమ్మ కాలనీ, శివమ్మ కాలనీ, చంద్రమ్మ కాలనీ, మహావీర్ నగర్, సుభాష్ చంద్ర బోస్ కాలనీ, మహంకాళీ నగర్ , ఇందిర హిల్స్ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు భాగ్యనగర్ ఏఈ షాబాజ్ ఆదివారం తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి విద్యుత్ డివిజన్ పరిధిలో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చైతన్య తెలిపారు. నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈనాడు కాలనీ, వివేకనంద నగర్, శుభోదయ కాలనీ, గాంధీ హైట్స్, ఎమ్మెల్యే ఇంటి పరిసరాల్లో సరఫరా నిలిచిపోతుందన్నారు.

# చెత్తఎత్తకుండానే బిల్లుల కోసం ఒత్తిడి !

## నిజాంపేట్ కార్పొరేషన్‌లో అధికారి వైఖరిపై ప్రజాప్రతినిధుల విస్మయం


నిజాంపేట్ కార్పొరేషన్, సర్వేనంబర్ 186 డంపింగ్‌యార్డులో పేరుకపోయిన చెత్త, దుర్వాసనతో ముక్కుమూసుకుంటున్న ద్విచక్రవాహనదారుడు

దుండిగల్, జనవరి 5 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేషన్ కార్యాలయంలో ఓ శాఖ ఉన్నతాధికారి వైఖరి విస్మయానికి గురి చేస్తుంది. పనులు చేయకుండానే బిల్లులు చెల్లించేలా కౌన్సిల్ తీర్మాణంలో పొందుపరచాలని అటు తన ఉన్నతాధికారి, ఇటు ప్రజాప్రతినిధుల చుట్టుతిరగడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఓ కాంట్రాక్టర్‌కు మొత్తం మూడు బిల్లులు చెల్లించాలని సదరు అధికారి ఒత్తిడి తీసుకురాగా.. ఒక్క బిల్లును మాత్రమే కౌన్సిల్ ఆమోదించినట్లు తెలుస్తున్నది. కార్పొరేషన్ కార్యాలయంలోనే సదరు అధికారి వ్యవహారం వివాదాస్పదంగా మారుతుందని పలువురు పేర్కొంటున్నారు.

### ఎందుకంత పట్టుబడుతున్నాడో తెలియడం లేదు..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎందరో గుత్తేదారులు ఉండగా ఒకేఒక్క గుత్తేదారు బిల్లుల ఆమోదం కోసం సదరు అధికారి ఎందుకంత పట్టుబడుతున్నాడో తెలియడం లేదని పలువురు వాపోయ్యారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ నుంచి ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సర్వేనంబర్ 186లోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి జవహర్ నగర్‌లోని ప్రాసెసింగ్ యూనిట్‌కు పంపిస్తారు. ఈ పనులను నిర్వహించేందుకు ఓ గుత్తేదారుకు గతేడాది పనులు అప్పగించారు. ఇందుకుగాను సదరు కాంట్రాక్టర్‌కు రెండునెలల కొరకు రూ.99 లక్షలను చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐతే ప్రతిరెండు నెలలకు ఒకసారి టెండర్ పిలువాల్సి ఉండగా ఇంజినీరింగ్ సెక్షన్ ఉన్నతాధికారి చలువతో సదరు కాంట్రాక్టర్ ఎడాది కాలంగా పనులు చేసుకుంటూ వెలుతున్నాడు.

### పాత టెండరే తరచూ రెన్యూవల్

ఎడాది క్రితం ఖరారు చేసిన టెండర్‌నే తరచూ రెన్యూవల్ చేస్తూ గుత్తేదారుకు లాభం జరిగేలా చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో సదరు గుత్తేదారుకు ఇప్పటి వరకు ఆరు నెలలకు సంబంధించి, మూడు దఫాల బిల్లులు రూ.2 కోట్ల 97 లక్షలు రావాల్సి ఉన్నది. కొన్నిరోజులుగా డంపింగ్‌యార్డు నుంచి చెత్తను జవహర్ నగర్‌లోని ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలించడంలో సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడు. సర్వేనంబర్ 186లోని డంపింగ్ యార్డులో చెత్త గుట్టలుగా పేరుకుపోతున్నది. రెండువైపుల ఉన్న రోడ్ల మీద చెత్త పేరుకుపోతుండటంతో అటుగా రాకపోకలు కొనసాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. సదరు గుత్తేదారు రోడ్డుపై పడిన చెత్తను సైతం డోజర్‌తో తీసివేయడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పాలకవర్గం సర్వసభ్యసమావేశం జరుగగా, సదరు ఇంజినీరింగ్ సెక్షన్ ఉన్నతాధికారి మాత్రం తనకు ఇష్టమైన కాంట్రాక్టర్ (చెత్త తరలించే)కు ప్రయోజనం చేకూరేలా పెండింగ్‌లో ఉన్న మూడు బిల్లులను సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని విశ్వప్రయత్నాలు చేయడంపై పాలకవర్గం అతని తీరుపై తలంటినట్లు తెలుస్తున్నది. కార్పొరేషన్ పరిధిలో ఎంతోమంది కాంట్రాక్టర్లు ఉండగా ఆ.. ఒక్కడి కోసమే సదరు అధికారి ఎందుకంతా ఉత్సాహం చూపిస్తున్నాడని మధ్యాహ్న భోజన సమయంలో ప్రజాప్రతినిధులు చర్చించుకున్నారు. సదరు గుత్తేదారు సుమారు 60 ట్రిప్పుల చెత్తను ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలించాల్సి ఉందని, అయినప్పటికీ సదరు బిల్లుకు ఆమోదం తెలిపేలా ఒత్తిడి చేయడమేంటనే గుసగుసలు వినిపించాయి. సదరు అధికారి కార్పొరేషన్‌లో మోనార్క్‌గా వ్యవహరిస్తాడని, తనకిష్టమైన వారికే పనులు అప్పగిస్తాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో శనివారం ఆయన ప్రవర్తించిన విధానం మరోసారి చర్చనీయాంశమైంది.

ఇదే విషయమై కమిషనర్ సాబేర్‌అలీని వివరణ కోరేందుకు యత్నించగా తాను కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్‌లో ఉన్నానని చెప్పగా, ఇంజినీరింగ్ శాఖ ఉన్నతాధికారి మాత్రం సర్వసభ్యసమావేశం ఉన్నానని, తర్వాత మాట్లాడుతానని చెప్పడం గమనార్హం.

## మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం



కుత్బుల్లాపూర్ : ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆయా కాలనీల్లోని మౌలిక వసతుల కల్పనకు వినతిపత్రాలను అందజేశారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లైన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా సంక్షేమ సంఘాల క్యాలెండర్లను ఆవిష్కరించారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం


కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను కలిసిన నియోజక వర్గ ప్రజలు

దుండిగల్, జనవరి 5 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పేర్కొన్నారు.ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, మహిళలు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం శంభీపూర్ కృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. శంభీపూర్ కృష్ణ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### కుర్మసంఘం సభ్యులకు సన్మానం

శంభీపూర్ గ్రామంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుర్మసంఘం అధ్యక్షుడు అక్కమొల్ల మనోహర్, కార్యవర్గ సభ్యులు ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు శంభీపూర్ కృష్ణను కలిశారు. సభ్యులను కృష్ణ అభినందించి శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అలరిస్తున్న పడమటి సంధ్యారాగం.. హాసిని



విదేశాల్లో ఉంటున్నప్పటికీ.. కళలపై మక్కువతో సాధన చేసింది. 15 ఏండ్ల చిన్నారి కర్ణాటక గాత్ర కచేరితో అలరించింది. కాలిఫోర్నియా, సాన్ డియాగోలో ఉండే తెలుగమ్మాయి హాసిని భట్టిప్రోలు ఆదివారం నాలెడ్జ్‌సిటీలోని మైహోం అభ్రలో మొదటి కచేరి ఇచ్చింది. కార్యక్రమానికి ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. హాసిని పోతన భాగవతం తెలుగు శ్లోకాలను ప్రచారం చేయడంలో ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నది.

- కొండాపూర్





## రామాలయంలో.. ధనుర్మాస ఉత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5 : కూకట్‌పల్లిలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు సాగుతున్నారు. ఆదివారం ఆలయంలో గోదా కల్యాణ వేడుకల్లో భాగంగా నిర్వహించిన గోదాదేవి సారె ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కాగా.. వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మనుమరాల్లు ఐరా, అధిర గోదాదేవి అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెల 10న వైకుంఠ ఏకాదశ ఉత్తర ద్వారా దర్శనం, 11న కూడారై (గంగాళముల పూజ), 13న గోదాదేవి కల్యాణ వేడుకలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రఫీ

జీడిమెట్ల : పనుల్లో నాణ్యతా ప్రమాణా లు పాటించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ రఫీ అన్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ పనులను ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, భగత్‌సింగ్ నగర్ మాజీ అధ్యక్షుడు అశోక్, యువజన నాయకులు నరేశ్ నేత, మహమ్మద్ హాఫీజ్, వరద రాజు, బస్తీ కమిటీ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, డివిజన్ ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్, రాము ముదిరాజ్, డివిజన్ యువ నాయకులు సాయికిరణ్, అమృత్, ఈశ్వర్‌రెడ్డి, బాబురావు, కేశవ్, వంశీ, అభిలాష్, నిఖిల్, ధర్మారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



## వరద కాలువ నిర్మాణ పనుల పరిశీలన

మియాపూర్ : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డు హోలిస్టిక్ దవాఖాన వద్ద చేపడుతున్న వరద కాలువ నిర్మాణ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు ఆదివారం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా వరద కాలువ నిర్మాణాలను విస్తృతంగా చేపడుతున్నామన్నారు. పనులలో జాప్యం లేకుండా పూర్తి చేయాలని, పనుల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చేసినందున వాహనదారులు సహకరించాలని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు కోరారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వైద్యపరీక్షలు చేయించుకోవాలి



అల్లాపూర్ : వయోవృద్ధులు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎస్.వి.ప్రసాద్ అన్నారు. ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌వీ సాయిప్రసాద్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నేత్ర ఐ ఇనిస్టిట్యూట్ వారి సౌజన్యంతో ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు ఇచ్చామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్.అంజన్‌రెడ్డి, నాగేశ్వరరావు, సాగర్ శ్రీలతిత పాల్గొన్నారు.

## రేపు ముగ్గుల పోటీలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5 : కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యగ్రౌండ్‌లో శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంకాంత్రి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు కట్టా నర్సింగరావు తెలిపారు. రేపు (మంగళవారం) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు ఉంటాయని, 18 ఏండ్ల పైబడిన మహిళలు రంగులు, గొబ్బెమ్మలు, సామగ్రిని తెచ్చుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు, నాలుగవ బహుమతి రూ.2 వేలు ఇవ్వడంతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 8885041041 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## కెమికల్ లారీని పట్టుకున్న పోలీసులు



దుండిగల్, జనవరి 5 : అక్రమంగా తరలిస్తున్న కెమికల్ లారీని దుండిగల్ పోలీసులు పీసీబీ అధికారులకు అప్పగించిన ఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు నుంచి సూర్యాపేటకు అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దుండిగల్ ఓఆర్ఆర్ రోడ్డు సమీపంలో సంతోషిదాబా వద్ద పట్టుకొని పీసీబీ అధికారులకు అప్పగించిన్నట్లు పోలీసులు తెలిపారు.



జగద్గిరిగుట్ట, జనవరి 5 : రంగారెడ్డి నగర్ డివిజన్ ఆదర్శనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకరయ్య ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబురాలు, ముగ్గుల పోటీలు జరిగాయి. దుర్గాభవాని, చంద్రలీల, జనాబాయి, నాగభూషణం, కోటేశ్వరరావు, నారాయణ, శివలీల, రవికుమార్ పాల్గొన్నారు.



## బహుమతులు అందజేత

కుత్బుల్లాపూర్ : విజేతలకు బహుమతులను అందజేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, తదితరులు



## క్యాలెండర్ ఆవిష్కరణ

అగ్ని కుల క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు , మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆదివారం ఆవిష్కరించారు. ప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్‌రావు , యూత్ ప్రతినిధులు శాంతారావు, తిరుపతిరావు, కోదండరావు, భాస్కర్‌రావు , కృష్ణారావు, కోదండ్ల కృష్ణ, నరేంద్రవర్మ, రుద్రమూర్తి, ఆనందరావు, తాతారావు, బాలకృష్ణ పాల్గొన్నారు. కోకోనట్ గ్రో అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- మియాపూర్



## ఎన్‌సీఎల్ ఎంక్లేవ్ (సౌత్) కాలనీ సంక్షేమ సంఘం కమిటీ నియామకం

కుత్బుల్లాపూర్, జనవరి 5 : కుత్బుల్లాపూర్ ఎన్‌సీఎల్ ఎంక్లేవ్ (సౌత్) కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా ఎంఆర్‌ఎస్ రాజు( నాని బాబు), ఉపాధ్యక్షుడు కె.సాంబశివరాజు, కార్యదర్శి టి.వి.ప్రసాద్, సహాయ కార్యదర్శి సాయి బాబా, కోశాధికారి టి.వేణుమాధవ్‌తో పాటు కమిటీ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నూతన కమిటీల ఎన్నిక

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 5: కీసర రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జూపల్లి అశోక్, ఉపాధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా భవానీశంకర్, సహ కార్యదర్శిగా పిడిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా అశోక్, గౌరవ సలహాదారులుగా తంగళ్లపల్లి కృష్ణ, జూపల్లి సాయిలు, జూపల్లి భిక్షపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

### మండల విశ్వకర్మ సంఘం

కీసర మండల విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మాజీ అధ్యక్షుడు బాలలింగాచారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవేం ద్ర, ప్రధాన కార్యదర్శిగా సింగోజు చందుచారి, కోశాధికారి గుడ్డోజీ కనక చారి, ఉపాధ్యక్షులుగా కాసోజు సంపత్ చారి, టిపోజు కృష్ణ చారి, ఉప కార్యదర్శిగా రవి చారి, సలహాదారులుగా ప్రభాకర్ చారి, బాలలింగాచారి, శ్రీనివాస చారి, రవీంద్ర చారి, నాగరాజు చారి, మురళీ చారి, కుకునూరు ఆంజనేయులు, అశోక్ చారి, కేసరి, సుదర్శన్ చారి, ప్రకాశ్ చారి, శ్రీనివాస్ చారి, లక్ష్మణ్ చారి, కృష్ణాచారి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.


పీర్జాదిగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేచామకూర మల్లారెడ్డి

## బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

**పీర్జాదిగూడ, జనవరి5 :** బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గం అన్నిరంగా ల్లో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో కనీసం మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్లలో రూ. 3కోట్ల 10 లక్షల నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు.

## నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మూసాపేటలోని జోన్ కార్యాలయంలో నేడు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ప్రజావాణిలో జడ్సీ అపూర్వ్‌చౌహాన్, జోనల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ప్రజాసమస్యలపై ఫిర్యాదులను ప్రజావాణిలో అందిస్తే.. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీలు వంశీకృష్ణ, గంగాధర్ తెలిపారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ – రూపాయలలో )టమాట 13, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 30, కాకర 35, బీర 35, క్యాబేజి 11, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 25, దొండ 45, చిక్కుడు 40, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 35, క్యాప్సికం 41, ఆలుగడ్డ 25, కీరా 19, దోస 21, సొర 20, పొట్లకాయ (1) 18, కంద గడ్డ 55, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 44, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 37, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 10 నుంచి 12, పచ్చి బఠాని 60, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 100, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 100 ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9:30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## మౌలిక వసతులు కల్పిస్తాం

మల్కాజిగిరి : మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మౌలాలి డివిజన్ గీతానగర్‌లో సీసీ రోడ్లు, మోడ్రన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులతో సర్వే చేయించి కొత్తగా సీసీ రోడ్లు, పార్కులలో జిమ్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు.